
సాక్షి శ్రీకాకుళం
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



శోభాయాత్రలో రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన వారాహి గణపతి



బాణసంచా వెలుగుల్లో పార్వతీ తనయుడు

విఘ్నేశా.. వీడ్కోలు



నిమజ్జనోత్సాహం



కళాకారుల ఆటాపాటా



గంగ ఒడికి గణపయ్య



వంతెనపై ట్రాఫిక్ జామ్

కాళ్లు ఉత్సాహంగా గంతులు వేస్తూనే ఉన్నా.. కళ్లలో సన్నటి కన్నీటి పొర కదలాడుతోంది. గొంతు జిగ్గరగా అరుస్తూనే ఉన్నా.. గుండె మాత్రం మౌనంగా రోదిస్తోంది. వినాయకుడి వీడ్కోలు ఉత్సవం శనివారం ఉద్వేగంగా జరిగింది. ఆటపాటలతో ఊరేగింపులు జరిగినా గణనాథుడిని గంగలో వదిలే సందర్భంలో అందరి కళ్లు చెమ్మగిల్లాయి. నవరాత్రులు పూజలందుకున్న విఘ్న నాయకుడు వీడ్కోలు చెబుతూ గంగమ్మ ఒడిలోకి జారుకున్నాడు.

న్యూస్‌రీల్

ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: యూరియా ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి ఎరువులపై అధికారులతో శనివారం వర్చువల్‌గా సమీక్షించారు. ప్రైవేట్ పంపిణీ కేంద్రాల వద్ద ఒక వీఆర్‌ఏ లేదా సచివాలయాల సిబ్బంది ఉండాలన్నారు. కూపన్లు ముందుగానే పంపిణీ చేయాలన్నారు. రైతులకు సమస్య ఉంటే కంట్రోల్ రూం 9121863788 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

8న పీఎం అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ వృత్తి విద్యా కోర్సులను అభ్యసించి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 8వ తేదీన ఎచ్చెర్లలో జరగనున్న పీఎం జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను (పీఎం నామ్) సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా ఇంటర్మీడియెట్ వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈఓ) రేగ సురేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన డీవీఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఐటీఐ ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తోన్న ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో ఐటీఐ విద్యార్థులతోపాటు ఇంటర్ పాసైన వారు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంఅండ్‌టీ, ఈటీ, ఈఈటీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ మేళాలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టంచేశారు. ఎచ్చెర్ల ఐటీఐ క్యాంపస్‌లో జరగనున్న అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియెట్ పాస్‌సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, వ్యక్తిగత బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు మూడు సెట్లతో పాటు మూడు పాస్ ఫొటోలతో హాజరుకావాలని డీవీఈఓ సురేష్ కుమార్ కోరారు.

లబ్బ ఆశ్రమ పాఠశాల నిర్వహణపై అసంతృప్తి

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం సీతంపేట ఏపీఓ చిన్నబాబు పరిశీలించారు. హాస్టల్ నిర్వహణపై ఏపీఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. గదులు శుభ్రంగా లేకపోవడం, భోజనం రుచిగా లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లకు చార్జిమెమోలు జారీ చేయాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

మధ్యాహ్నం నుంచి ఆదిత్యాలయం మూసివేత



అరసవల్లి: శతభిషా నక్షత్రయుక్త రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9.56 గంటల స్పర్శకాలం కారణంగా.. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం ప్రధాన ద్వారాలు మధ్యాహ్నం 2 గంటలకు మూసివేస్తున్నట్లుగా ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. ఆదిత్యుడిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వదర్శనాలను సకాలంలోనే దర్శనాలు సకాలంలో జరిగేలా చర్యలు చేపడుతున్నట్లుగా ఈఓ ప్రసాద్ ప్రకటించారు. కాగా చంద్ర గ్రహణ స్పర్శ కాలం ఆదివారం రాత్రి 9.56 గంటలు, మధ్య కాలం రాత్రి 11.40 గంటలు, మోక్ష కాలం అర్ధరాత్రి దాటాక 1.26 గంటలు, ఆద్యంత పుణ్యకాలం వేకువజామున 3.30 గంటలు (సోమవారం)గా ఉన్నందున గ్రహణానంతరం సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలను ఆలయంలో చేపడతామని, అనంతరం సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి తిరిగి భక్తులకు సర్వదర్శనాలకు అనుమతిస్తామని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వివరించారు.

విద్యార్థుల భవితకు 'విజ్ఞాన్ మంతన్'తో బాట

శ్రీకాకుళం: విద్యార్థుల భవితకు విజ్ఞాన మంతన్ తోడ్పడుతుందని ఇన్‌చార్జి డీఈఓ ఎ.రవిబాబు అన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విద్యార్థి విజ్ఞాన మంతన్-2025 కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఏటా విద్యార్థి విజ్ఞాన మంతన్ పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభా అన్వేషణ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్ షిప్ స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

జీరో బిజినెస్..

ప్రాణాలకు రిస్క్





గుప్తా హత్యకు నిరసనగా మూత పడిన బంగారు షాపులు

- 23 ఏళ్ల క్రితం నరసన్నపేటకు చెందిన ఇద్దరు వ్యాపారుల హత్య
- తాజాగా అదే తరహాలో హత్యకు గురైన గుప్తా
- ఆందోళనకు గురవుతున్న బంగారం వర్తకులు
- గుప్తా హత్యకు నిరసనగా బంగారం షాపుల మూత

నరసన్నపేట:

బంగారం వ్యాపారి వెంకట పార్వతీశం గుప్తా హత్య జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. ఎవరిని నమ్మాలో.. ఎవరిని అనుమానించాలో అర్థం కాని పరిస్థితుల్లో వ్యాపారులు ఉన్నారు. అయితే ఈ సంఘటనకు మూలం వ్యాపారులు జీరో బిజినెస్ చేయడమేనని అందరూ అంటున్నారు. అత్యాశకు పోయి అడ్డదారుల్లో వ్యాపారం చేయడం తగదని అంటున్నారు. నమ్మిన వ్యక్తే పథకం ప్రకారం ఇతరుల సాయంతో గుప్తాను హత్య చేయడం, శ్రీకాకుళం సమీపంలోని రామిగెడ్డలో మృత దేహాన్ని పడేయడం, హత్య జరిగిన 10 రోజుల తర్వాత మృతదేహాన్ని పోలీసులు గుర్తించడం తెలిసిందే. ఈ సంఘటన బంగారం వ్యాపారుల్లో కనువిప్పు తెస్తుందా అనే దానిపై కూడా చర్చ జరుగుతుంది. సరిగ్గా 23 ఏళ్ల క్రితం నరసన్నపేటకు చెందిన నారాయణశెట్టి రవీంద్రనాద్ ఠాగూర్, గుడ్ల చంద్రభూషణ గుప్తాలు కూడా ఇదే తరహాలో హత్యకు గురయ్యారు. పర్లాకిమిడితో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల్లో బంగారు ఆభరణాలు సేల్ చేసి మిగిలిన ఆభరణాలు, సేల్ చేయగా వచ్చిన డబ్బుతో నరసన్నపేటకు తిరిగి వస్తుండగా నవతల ఘాటీ వద్ద పర్లాకిమిడికి చెందిన వ్యాపారులు ఇచ్చిన సమాచారంతో కొందరు దుండగులు అటకాయించి వీరిని హతమార్చి ఆభరణాలు, డబ్బు తీసుకుపోయారు. మృతదేహాలను బెండి రైల్వే గేటు వద్ద తుప్పల్లో వేసేశారు. రెండు రోజుల తర్వాత సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు ఇదే తరహాలో గుప్తాను చంపేశారని వ్యాపారులు అంటున్నారు.

తక్కువకు కొని ఎక్కువకు అమ్మడమే..

నరసన్నపేటలో రిటైల్ బంగారం షాపులు 64 ఉన్నాయి. హోల్‌సేల్ షాపులు మరో 12 ఉన్నాయి. జిల్లాలో ఐదారు వందల షాపులు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం చేస్తున్న వారు కొందరే. మిగిలిన వారందరూ జీరో బిజినెస్ చేస్తున్నవారే. కోట్లల్లో వ్యాపారం చేస్తున్నా.. వేలల్లో కూడా ట్యాక్స్ కట్టరు. అంతా అక్రమ వ్యాపారమే. ఇటీవల బీఐఎస్ అధికారులు వచ్చి నరసన్నపేటలో తనిఖీలు చేపట్టగా హాల్‌మార్క్ వ్యవహారం బయట పడిన విషయం విదితమే. దీంట్లో భాగంగా గుప్తా కూడా జీరో బిజినెస్‌కు అలవాటు పడి విశాఖ తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు అక్రమంగా(లెఫ్ట్) బంగారు బిస్కెట్లు కొనుగోలు చేసి గ్రాముకు కమీషన్ తీసుకుని స్థానికులకు ఆ బిస్కెట్లు అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా గడిచిన ఐదారేళ్లుగా ఇదే వ్యాపారంలో ఉన్నాడు. మొదట్లో కొందరు వ్యాపారుల వద్ద ముందుగా డబ్బు తీసుకొనేవాడు. బిస్కెట్స్ తెచ్చి ఆ మొత్తానికి ఇచ్చేవాడట. ఏడాది కిందటి నుంచి ఈయనే పెట్టుబడి పెట్టి బిస్కెట్స్ తేవడం, కమీషన్‌కు అమ్మకాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అదే ఆయన ప్రాణాల మీదకు తెచ్చింది. విశాఖకు తరచూ వెళ్లే గుప్తా ఎక్కువగా డ్రైవర్‌గా సంతోష్‌నే తీసుకువెళ్లేవాడు. అతని కళ్ల ముందే గుప్తా కోటీశ్వరుడు కావడం సంతోష్‌కు కంటగింపుగా మారింది. దీంతో పథకం పన్ని ప్రాణాలు తీశాడు. గుప్తాను హత్య చేసిన వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని, ఎలాంటి ప్రలోభాలకు పోలీసులు గురికావద్దని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు. దీంట్లో భాగంగా నరసన్నపేటలో శనివారం బంగారం షాపులు మూసివేశారు. సాయంత్రం కొందరు వర్తకులు పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి అనంతరం పోలీసు అధికారులను కలిసి హంతకులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా..

మరో ఐదుగురు నియామకం



పాలవలస విక్రాంత్ | పెనుమత్స సూర్య నారాయణరాజు | శ్యామ్ ప్రసాద్‌రెడ్డి | దుంపల లక్ష్మణరావు | కరిమి రాజేశ్వరరావు

- శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర కార్యాలయం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) నియమితులైన వారిలో జిల్లా నుంచి ముగ్గురు నియామకం
- దుంపల రామారావు, కరిమి రాజేశ్వరరావు, శ్యాంప్రసాద్‌రెడ్డికి చోటు
- వీరికి రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయింపు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) ఐదుగురిని నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీకి అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని పరిగణనలోకి తీసుకుంది. సీనియారిటీ, విధేయతకు పెద్ద పీట వేసింది. రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంట్) నియమితులైన రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించింది. జిల్లాకు సంబంధించి పార్టీ రాష్ట్ర కాళింగ విభాగం అధ్యక్షుడు దుంపల రామారావు(లక్ష్మణరావు), డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంట్) నియమితులవ్వగా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విజయనగరం జిల్లా నుంచి పెనుమత్స సూర్యనారాయణ రాజు(సురేష్‌బాబు)లు నియమితులయ్యారు.

ఒక్కొక్కరికీ రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాలు

- రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంట్) నియమితులైన వారిలో ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన దుంపల రామారావుకు పలాస, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు.
- నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన కరిమి రాజేశ్వరరావుకు శ్రీకాకుళం, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు.
- ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి టెక్కలి, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు.
- పాలకొండకు చెందిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు పాతపట్నం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు.
- విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవ్వగా ఆయనకు ఎచ్చెర్ల, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు.

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంట్) నియమితులైన వీరంతా పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, రీజినల్ కోఆర్డినేటర్, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారు. వీరి నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఎలుగుబంటి దాడిలో నలుగురికి గాయాలు

- ఎలుగుబంటిని హతమార్చిన గ్రామస్తులు

మందస,పలాస: మందస మండలం నారాయణపురం గ్రామంలో ఎలుగుబంటి మరోసారి శనివారం దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. శుక్రవారం నారాయణపురం గ్రామంలోకి ప్రవేశించి హల్ చల్ చేసిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా ఒక వ్యక్తి ఎలుగు దాడిలో గాయాలపాలయ్యాడు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే శనివారం సాయంత్రం కూడా గొరకల పాపారావు, పందిరి గున్నయ్య, లక్ష్మీనారాయణ, మోహనరావులపై దాడి చేసి గాయపర్చింది. దీంతో గ్రామస్తులు ఎలుగును హతమార్చారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణనాయుడు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. కాశీబుగ్గ నుంచి ముగ్గురు వైద్యులు వచ్చి క్షతగాత్రులను పరిశీలించారు. ప్రస్తుతం వారికి ప్రాణాపాయం లేదని చెప్పారు. పోస్టు మార్టం చేసి తర్వాత ఎలుగుబంటి మృతదేహాన్ని ఖననం చేశారు. ప్రస్తుతం ఎలుగు దాడికి గురైన నలుగురు వ్యక్తులు హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



మృతి చెందిన ఎలుగుబంటి

గూగుల్ అంబాసిడర్‌గా బీఆర్‌ఏయూ ఈసీఈ విద్యార్థి



గూగుల్ కిట్‌ను విద్యార్థికి అందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగానికి చెందిన బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి శతపతి సాయి ప్రదీప్ గ్రామీణ ప్రాంత విద్యా సంస్థల కేటగిరీ నుంచి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్‌కు స్టూడెంట్ అంబాసిడర్ (జీఎస్ఏ)గా ఎంపికయ్యారు. ఏఐ ద్వారా జెమినీ ఏఐ, గూగుల్ టెక్నాలజీపై స్వల్ప కాలిక అవగాహన, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు సాయిప్రదీప్‌కు అవకాశం లభిస్తుంది. అలాగే సాంకేతిక సంబంధిత పోటీల నిర్వహణ, దేశవ్యాప్తంగా ఉన్న స్టూడెంట్ ఇన్నోవేటర్స్‌కు సంస్థను అనుసంధానం చేయడం, నాయకత్వ లక్షణాలు పెంచుకోవడంపై కూడా దృష్టి సారించవచ్చు. విద్యార్థి ఎంపికపై వర్సిటీ వీసీ ఆర్‌కే రజనీ, రిజిస్ట్రార్ పి.సుజాత ప్రత్యేకంగా అభినందించారు. గూగుల్ అంబాసిడర్ కిట్‌ను ఈ సందర్భంగా సాయిప్రదీప్‌కు అందజేశారు.



తలో మాట..

ఎరువులకు తంటా



కొరత ఉంది..

యూరియా కొరత ఉంది.. రైతులు అవస్థలు పడుతున్నారు. కొన్ని దేశాల్లో యుద్ధాల వల్ల ఈ సమస్య వచ్చింది. ప్రధానంగా ఏప్రిల్, జూన్ నెలల్లో నిల్వ చేయకపోవడం వల్ల ఈ అవస్థ వచ్చింది. అయినా ప్రభుత్వం యూరి యా కొరతకు ప్రత్యామ్నాయం చూపిస్తోంది.

– శనివారం జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేసిన వ్యాఖ్యలివి..

జిల్లాలో రైతులు యూరియా కోసం అవస్థలు పడుతుంటే నాయకులు, అధికారులు పరస్పరం విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారు. యూరియా లేకపోవడం నిజమేనని ఒకరు అంటే.. నిల్వలు ఉన్నాయని మరొకరు అంటున్నారు. కానీ రైతులు మాత్రం ఆర్‌ఎస్‌కేలు, ప్రైవేటు దుకాణాల వద్ద గంటల తరబడి నిలబడి తిట్టి పోస్తుండడం నిజం. జిల్లాకు ఎంత ఎరువు అవసరమో, ప్రభుత్వం ఎంత తెప్పించిందో, రైతు చెంతకు ఎంత చేరుతుందో అన్నది చిదంబర రహస్యమైపోయింది. –జలుమూరు, శ్రీకాకుళం పాతబస్టాండ్



యూరియా జిల్లాలో దొరికే పరిస్థితి లేకపోవడంతో పాతపట్నం వాసులు ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై ఇలా యూరియా తెచ్చుకుంటున్నారు. యూరియా కొరతకు ఈ చిత్రమే నిదర్శనం.

యూరియా ఉంది



జిల్లాలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో ఈ ఖరీఫ్‌కు వరి, ఇతర పంటలు కలిపి 3,73,000 ఎకరాల్లో సాగవుతోంది. ఈ సాగుకు మొదటి, రెండో విడతల్లో కలిపి 20,481 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైంది. అయితే రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 11,443 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 12,393 మెట్రిక్ టన్నులు కలిపి, మొత్తం 23,836 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటివరకు రైతులకు సరఫరా చేశాం. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద 415.3 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 123 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 561 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,099 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది.

– ఈ నెల 1న కలెక్టర్ చెప్పిన మాటలివి..

ఎరువుల పంపిణీలో విఫలం



కూటమి ప్రభుత్వం కనీసం అన్నం పెట్టే అన్నదాతలకు సకాలంలో ఎరువులు కూడా అందించడం లేదు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే రైతులకు ఈ ప్రభుత్వంలో ఇబ్బందులు తప్పడం లేదు. పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రంలో యూరియా కొనుక్కోవాల్సి వస్తోంది.

– మద్ది నారాయణరెడ్డి, రైతు, పెద్దసీది గ్రామం, పాతపట్నం మండలం

క్లుప్తంగా

సాంకేతిక రంగంలో నైపుణ్యం పెంచుకోవాలి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పుల్లో భాగంగా విద్యార్థులతో పాటు అధ్యాపకులు మరింత నైపుణ్యత పెంచుకోవాలని ప్రముఖ కంప్యూటర్ విభాగం సంస్థ క్వాంటమ్ కంప్యూటింగ్ వైస్ ప్రెసిడెంట్ లక్ష ప్రియదర్శి పేర్కొన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలతో శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో సాంకేతిక రంగంలో అత్యంత ఆధునీకరణ సామర్థ్యం పొందిన తమ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం వలన కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల పురోగతికి మేలు జరుగుతుందన్నారు. క్వాంటం టెక్నాలజీలో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, సర్టిఫికేషన్ కోర్సులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొడక్ట్ లీడర్ ఎం.చంద్రమౌళి, కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకుడు బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న అధ్యక్షురాలు ప్రవల్లికప్రియ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రవల్లికా ప్రియ అన్నారు. ఏపీ జేఏసీ మహిళా విభాగం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ వసతి గృహం సమావేశ మందిరంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చైల్డ్ కేర్ లీవ్‌లు కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలు ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం ఆరు నెలలు మాత్రమే ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండేళ్ల పాటు సెలవు ఇవ్వాలని కోరారు. అలాగే తమకు రావాల్సిన నాలుగు డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల పే స్లిప్పులు సకాలంలో వచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, ఏపీ జేఏసీ కార్యదర్శి వెంకట రమణ, జి.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా స్పష్టం చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు భవనంలో జువెనైల్ జస్టిస్ - పిల్లల రక్షణ చట్టాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల హక్కుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో కుటుంబం, పాఠశాల, సమాజం కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కర రావు, శ్రీకాకుళం కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపాల్ మేజిస్ట్రేట్ (జువెనైల్ జస్టిస్ బోర్డు) కేఎం జమ్రుత్ బేగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ యు.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, చిత్రంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- కూటమి పాలనపై 15 నెలల్లో ప్రజా వ్యతిరేకత
- సూపర్ సిక్స్ పేరుతో నయవంచన
- యూరియా కోసం రైతులు రోడ్లెక్కడం దారుణం
- రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్, గంజాయితో అఘాయిత్యాలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన 15 నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జోన్-1 మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అలాగే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను, ముఖ్యంగా మహిళలను నిట్టనిలువుగా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ కంటే ఎక్కువ మేలు చేస్తానని సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎప్పుడూ చూడని విధంగా రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కేంద్రం పూర్తి స్థాయిలో యూరియాను సరఫరా చేసినప్పటికీ వాటిని టీడీపీ నేతలు బ్లాక్ మార్కెట్ తరలించారని ఆరోపించారు.

మహిళలకు రక్షణ లేదు

రాష్ట్రంలో హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడి చేసేసిందని విమర్శించారు. 80 వేల బెల్టుషాపులు పుట్టుకొచ్చాయని, పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతులు ఇచ్చేశారని తెలిపారు. మద్యం కారణంగానే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్ డోర్ డెలివరీ జరుగుతోందని, గంజాయిని హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే పండిస్తున్నారని వివరించారు. వాటిని అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. గుడిలో ఉన్న దేవుడిని వెలివేసి మళ్లీ దేవుడు రావాలని ప్రార్థిస్తున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రానున్న మూడేళ్లు ప్రజల తరపున పోరాటం చేయడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు రూ.81 వేల కోట్ల బకాయి

కూటమి ప్రభుత్వం రైతులకు మొదటి ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టి వెన్నుపోటు పొడిచిందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తానని చెప్పి ఒక్కో మహిళకు రూ.22,500 బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3 వేల కింద ఇప్పటి వరకు రూ.45 వేలు బకాయి ఉందన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వకపోగా కొత్తగా ఒక్కరికి పింఛన్ గానీ, రేషన్ కార్డు గానీ మంజూరు చేయలేదన్నారు. పైగా రాష్ట్రంలో 3 లక్షల మంది అర్హులైన వారి పెన్షన్ తొలగించిందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇలా మొత్తంగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం రూ.81వేల కోట్లు బాకీ పడిందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి 16 రకాల బస్సులు ఉంటే.. కేవలం 5 రకాల బస్సుల్లో అవకాశం కల్పించారన్నారు. అలాగే ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.

వైద్య విద్యపై ప్రభుత్వం కుట్రలు



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, చిత్రంలో పేరాడ తిలక్ తదితరులు

- ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనలు
- యూరియా కోసం రైతుల తిప్పలు కనిపించడం లేదా..?
- మాజీ స్పీకర్ తమ్మినేని మండిపాటు

టెక్కలి: డాక్టర్ కావాలనే పేద విద్యార్థుల కలలను నాశనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం మండిపడ్డారు. శనివారం టెక్కలి పార్టీ కార్యాలయంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైద్య విద్యను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనలు ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిరుపేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే, వాటిలో 10 కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. కొత్త వైద్య కళాశాలల కోసం ఇతర రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తెస్తుంటే, మన రాష్ట్రంలో ఉన్న మెడికల్ సీట్లును రద్దు చేసుకోవడమేంటని ప్రశ్నించారు. మరోవైపు యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీశారు. రైతులు పడుతున్న కష్టాలపై ఈనెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు అర్థ రహితం

యూరియా కోసం రైతులు అవస్థలు పడుతుంటే, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయని పేరాడ తిలక్ మండిపడ్డారు. భోజనాల కోసం ప్లేట్లు పట్టుకుని నిల్చున్నపుడు.. యూరియా కోసం క్యూలో నిలబడలేరా అని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. 15 నెలల కూటమి పాలనలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని దుయ్యబట్టారు. సమావేశంలో టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.మోహన్‌రెడ్డి, టి.పాల్గుణరావు, నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్, అన్నెపు రామారావు, కె.బాలకృష్ణారావు, ఆర్.మల్లయ్య, జి.గురునాథ్‌యాదవ్, ఎం.అప్పారావు, యర్ర చక్రవర్తి, చిన్ని జోగారావు, కెల్లి గోవింద్, డి.రామకృష్ణారెడ్డి, పి.వెంకట్రావు, కె.అజయ్, పి.రమేష్, ఎన్.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

ఇచ్ఛాపురం: స్థానిక పోస్టాఫీస్‌లో దాచుకున్న సొమ్ములను వెంటనే చెల్లించాలని ఖాతాదారులంతా ఆందోళనకు దిగారు. ఈ పోస్టాఫీసులో దాచుకొన్న సుమారుగా రూ.3 కోట్ల సొమ్మును ఆన్‌లైన్ స్కాం కారణంగా బాధితులంతా నష్టపోయిన విషయం జులై నెలలో బాధితులకు తెలిసింది. అయితే ఖాతాదారులు దాచుకొన్న సొమ్మును ఖాతాల్లో పడేటట్లు చూస్తామని జిల్లా పోస్టల్ అధికారులు హామీచ్చారు. కానీ ఇప్పటికీ ఖాతాల్లో నగదు జమ అవ్వకపోవడంతో శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొమ్ములు రెండు వారాల్లోగా చెల్లించకపోతే నిరాహార దీక్షలు చేయడానికి సిద్ధమని ప్రకటించారు. ఇదే విషయంపై ఈ కేసును సీబీఐకి ఇవ్వగా ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోస్టల్ జిల్లా అధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాతాదారులు చాట్ల లోహిదాస్, బాలరాజు, హైమా. కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



బొడ్డేపల్లి చైత్రికా

బూర్జ: అండర్-15 బాలికల బ్యాండ్మింటన్ విభాగంలో బూర్జ మండలం గుత్తావల్లి గ్రామానికి చెందిన బొడ్డేపల్లి చైత్రికా కృష్ణ జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాలలో శుక్ర, శనివారాల్లో జాతీయ స్థాయి బ్యాండ్మింటన్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆమె ఎంపికైనట్లు తల్లిదండ్రులు శనివారం తెలియజేశారు. చైత్రిక పాలకొండలోని డీఏవీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చైత్రిక గతంలోనూ అండర్-13 బాలికల విభాగంలో జాతీయ ఛాంపియన్-23వ సంవత్సరంలో ఘన విజయం సాధించింది. అదేవిధంగా శాప్ బ్యాండ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి అండర్-11, అండర్-13, అండర్-15 విభాగాల్లో వరుసగా మూడు సంవత్సరాలు ఛాంపియన్‌గా నిలిచింది. విజయంపై పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

ఆలయంలో పుస్తెలు చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

మందస: మండలంలో చిన్న దున్నవూరు గ్రామంలోని పితాలపోలమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెలు తాడు చోరీ జరిగిన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని దుండగులు గర్భగుడి తాళం పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న పుస్తెలతాడు, హుండీ నగదు దొంగలించారు. సమాచారం తెలుసుకున్న మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



రాజేష్ మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని వాంబేకాలనీలో కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ శనివారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. భార్య, ఇద్దరు పిల్లలతో జొన్నాడ రాజేష్ అనే వ్యక్తి వాంబే కాలనీలో నివసిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో రాజేష్ వినాయకుని ఊరేగింపునకు వెళ్లాడని.. అటునుంచి వచ్చే క్రమంలో రోడ్డుపక్కనే ఉన్న పెద్ద కాలువలో జారిపడిపోయాడన్నారు. ఎవరూ గమనించకపోవడం.. శనివారం ఉదయాన చనిపోయి ఉండడంతో తమకు సమాచారం వచ్చిందన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు సందర్శన

రణస్థలం: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సభ్యులు శనివారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ఇన్‌పుట్స్, బీజామృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, జిల్లేడు ద్రావణం, ఘన జీవామృతం, విసముసిడి కషాయం తయారీపై ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ గోవింద రెడ్డి, రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్‌లు వారికి వివరించారు. అనంతరం రైతులు నవధాన్యాలు సాగు చేస్తున్న పొలాలను పరిశీలించి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ధనుంజయ్, ఎన్‌ఆర్‌వో టీమ్ సభ్యులు తరుణ్ ఆదిత్య, బి.శ్రీను, ఎన్ఎఫ్ఏ ఐసీటీ శివకృష్ణ, ఎన్ఎఫ్ఏ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష, డీఎంఎంటీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల కబ్జా చేసిన స్థలం చదును చేసిన దృశ్యం

మఠం భూములు హాంఫట్..!

- బావాజీ మఠం భూముల కబ్జా
- ఆక్రమణదారుల చేతుల్లోకి రూ.కోట్లు విలువైన భూములు
- అక్రమ లే అవుట్లకు అడ్డగోలు అనుమతులు



తోటాడ గ్రామంలో బావాజీ మఠం భూముల్లో నిర్మాణాలు

ఆమదాలవలస రూరల్: ఆక్రమించుకునే అవకాశమే ఉండాలి గానీ.. ఆకాశాన్ని కూడా వదలరు ఇక్కడి అక్రమార్కులు. వీరి కన్నుపడితే ఎటువంటి భూములైనా మటాస్ కావాల్సిందే. దేవుడి భూములైనా.. ప్రభుత్వ బంజరు భూములైనా అన్యాక్రాంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దర్జాగా దురాక్రమణ చేయడమే కాదు.. అనధికార లే అవుట్లు వేయడంలోనూ ముందుంటారు. మహా నగరాలకు తీసిపోనివిధంగా భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఆమదాలవలస రూరల్ మండలంలో కబ్జారాయుళ్ల దర్జా ఇది. ఇటీవల తోటాడ గ్రామంలో బావాజీ మఠం భూముల ఆక్రమణలే ఇందుకు నిదర్శనం.

ఆగని ఆక్రమణల పర్వం

గత కొంతకాలం నుంచి ఆమదాలవలస మండలం తోటాడ గ్రామంలో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. అధికారుల కళ్లెదుటే ఈ కబ్జాలు జరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. సర్వే నంబర్ 121లో 199.48 ఎకరాల బావాజీ మఠం భూములు దర్జాగా కబ్జా చేశారు. కొందరు కూటమి నాయకుల అండతో అక్కడ భూదందా చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒడిశాకు చెందిన మఠం యజమానులు ఇక్కడ నుంచి వెళ్లిపోవటంతో పాటు వారి వారసులు కూడా ఇక్కడ అందుబాటులో లేరు. దీంతో కబ్జాదారులు ఈ భూములు ఆక్రమించుకొని వ్యాపారం సాగిస్తున్నారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకొని కొత్తరోడ్డు వద్ద ఉన్నటువంటి మఠం భూములను సైతం ఆక్రమించారు.

అధికారుల చేతివాటం

ఇకపోతే ఆక్రమణదారుల అక్రమ లేఅవుట్లకు అనుమతులు అందించడంలో అధికారులు చేతివాటం చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వాస్తవానికి ఏదైనా లే అవుట్‌కు అనుమతి పొందాలంటే అందుకు సంబంధించిన భూపత్రాలు ఉండాలి. అయితే ఇతరులు భూములకు సంబంధించి అక్రమ లే అవుట్లకు అనుమతులు మంజూరు చేశారంటే దీని వెనుక ఎంత చేతివాటం ఉందో అన్న విషయం అర్థమవుతోంది.

అక్రమ రిజిస్ట్రేషన్లు

వాస్తవంగా మఠం భూములకు సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేసే అధికారం లేదు. అయితే సంబంధం లేని సర్వే నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకరిస్తున్నారని పలువురు మాట్లాడుకుంటున్నారు. అలాగే మఠం భూముల్లో వ్యాపార భవనాలు గానీ, అపార్ట్‌మెంట్లు గానీ నిర్మిస్తే విద్యుత్ సదుపాయం అందించకూడదు. కానీ విద్యుత్ శాఖ అధికారులు అధిక మొత్తంలో అక్రమార్జనకు పాల్పడి అడ్డగోలుగా ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు అందించినట్లు తెలుస్తోంది.

జోరందుకుంటున్న నిర్మాణాలు

ఈ స్థలంలో మహా నగరాలను తలపించేవిధంగా అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. ఆక్రమణదారులు ఇతరులకు విక్రయించేందుకు కొందరు అపార్ట్‌మెంట్ నిర్మాణ గుత్తేదారులకు ఈ స్థలం అప్పగిస్తున్నారు. అంతేకాకుండా కొనుగోలుదారులకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కూడా అందించడం విశేషం. ఏదిఏమైనా వందల ఎకరాల స్థలాన్ని ఆక్రమణదారులు యథేచ్ఛగా దోచుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి ఈ కబ్జాలకు అడ్డుకట్టు వేయకపోతే మరిన్ని భూములు మాయమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

240 లీటర్ల నాటుసారా పట్టివేత



నాటుసారా ప్యాకెట్లు చూపిస్తున్న పోలీసులు

కంచిలి: మండల పరిధిలో సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ ఆధ్వర్యంలో శనివారం జరిపిన తనిఖీల్లో 240 లీటర్ల నాటుసారాను పట్టుకొని నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా నుంచి నాటుసారా రవాణా అవుతోందన్న సమాచారం మేరకు చొట్రాయిపురం బస్టాప్ వద్ద ఒక ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 1,200 నాటుసారా ప్యాకెట్లు(120 లీటర్లు)ను పోలీసులు పట్టుకున్నారు. అలాగే ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, కంచిలి మండలం కాలాపాని గ్రామానికి చెందిన సవర నాయక్, బూరగాం గ్రామానికి చెందిన కొర్రాయి గోవింద్‌లను అరెస్టు చేశారు. ఈ నాటుసారా ప్యాకెట్లను బూరగాం గ్రామానికి చెందిన కర్రి మోహిని, రాపాక కృష్ణమూర్తి, గోకర్ణపురం గ్రామానికి చెందిన అయితి దాశరథికి సరఫరా చేస్తున్నట్లు చెప్పడంతో వారి మీద కూడా కేసులు నమోదు చేశారు. దేవిధంగా కంచిలి మండలంలో జలంత్రకోట పాతాళేశ్వరుని గుడి దగ్గర ఒక ద్విచక్ర వాహనాన్ని పట్టుకొని, 120 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారాను రవాణా చేస్తున్న కంచిలి మండలం కుంబరినొగాం గ్రామానికి చెందిన పింకు గౌడ, తలతంపర పంచాయతీ పరిధి కాకర్లపుట్టుగ గ్రామానికి చెందిన కాకర్ల సోమేష్‌లను అరెస్టు చేశారు. దాడుల్లో పోలీసు సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి, గుణాకర్ తదితరులు లు పాల్గొన్నారు.

WANTED
ENGLISH FACULTY
FOR HIGHER CLASSES
Salary - Rs. 26000/-
Timings : 8.50 AM to 4.20 PM only
Holidays - As per Govt. norms
OXFORD SCHOOL
OLD HB COLONY, SRIKAKULAM
Cont: 9154000013

సాక్షి సండే క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I SHAIK SHAMSADH BAGAM (Old name) W/O : SHAIK MASTAN aged 53 years Residing at Door No:14-3-80/A Krishna Nagar Near Oosavanipeta, railway gate, Amadalavalasa - 532185, Srikakulam Dist. Changing my name from SHAIK SHAMSADH BAGAM (old name) to SHAIK SHAMSHAD BAGAM W/O SHAIK MASTAN Hence forth being called as SHAIK SHAMSHAD BAGAM (New name) for all purposes.

PLOT FOR SALE
■ శ్రీకాకుళం తోటపాలెంలో 30x50 (166.6 Sqy.) మరియు చిలకపాలెం వద్ద కేశవదాసుపురం బస్టాండ్ వద్ద 484 Sqy. టేకుచెట్లతో Plots అమ్మకానికి కలవు. ఫోన్ : 89190 58186 [V- 2856]

FOR SALE
■ BSNL POSTAL HOUSING SOCIETY Residential and Commercial Sites near Bengaluru International Airport. Rs:1400/- per sqft Bang on 8 Lane (330 feet Ring road) Booking Open for General public Call: 90715 34000 [QA-2295]

WANTED
■ WANTED ENGLISH FACULTY FOR HIGHER CLASSES . ATTRACTIVE SALARY OFFERED. CONTACT OXFORD SCHOOL. OLD HB COLONY SRIKAKULAM PH: 9154000013 [SCA25007936]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 98664 36279, 92814 52843. [B-1280519]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1272875]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7995365999 [HA-16138]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్ల ను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663 [SCA25007794]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్,వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453/ 9391036931 [HA-16042]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (TG NO-1) నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥. భో+వ+జీతం: 16-18 వేలు. 9133271122/9908333188 [SCA25007939]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

यूनियन बैंक యూనియన్ బ్యాంక్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792/2537782. మొబైల్ నెంబర్: 9324517291, 9390810969. ఇ-మెయిల్ ఐడి: ubin0817295@unionbankofindia.bank

APPENDIX-IV-A [See Proviso to Rule 8 (6)]
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
[illegible] "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 26.09.2025న విక్రయించబడుతుందని [illegible]

ఇ-వేలం తేది & సమయం: 26.09.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 రుణగ్రహీత: శ్రీ సూరు శ్యామ సుందర రావు, [illegible] డి.నెం. 1-270, పాండురంగ వీధి, కేశవపురం గ్రామం, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా-532312. సహ-రుణగ్రహీత: శ్రీమతి. [illegible] డి.నెం. 1-270, పాండురంగ వీధి, కేశవపురం గ్రామం, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా-532312. బకాయి మొత్తం: తేది. 30.06.2025 నాటికి బకాయి రూ. 34,91,229.00 [illegible] + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు
ఇచ్ఛాపురం మండలం, కేశవపురం రెవిన్యూ గ్రామం, [illegible] డోరు నెం. 1-270, సర్వే నెం. 352/33, [illegible] 266.60 చ.గ॥ లేదా 222.944 చ.మీ॥ [illegible] 40.00 అ॥, [illegible] 60.00 అ॥.
రిజర్వు ధర: రూ. 45,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 4,50,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 45,000/-
[illegible] (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) [illegible] https://baanknet.com [illegible] (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.
తేది : 03-09-2025, స్థలం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా